క్లుప్తంగా

ఎఫ్‌సీఐలో విద్యార్థులకు పోటీలు



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆరిలోవ: ఈ నెల 27న జరగనున్న ప్రపంచ టూరిజం దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు మంగళవారం పలు పోటీలు నిర్వహించారు. క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన, చిత్రలేఖనం, తదితర పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బుధవారం జరగనున్న టూరిజం దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవి, పార్థసారథి, కుముదిని, సిబ్బంది పాల్గొన్నారు.

సాగరతీరంలో స్వచ్ఛత రన్



స్వచ్ఛత రన్‌లో పాల్గొన్న కస్టమ్స్ అధికారులు

బీచ్ రోడ్డు: కస్టమ్స్ శాఖ ఆధ్వర్యంలో సాగరతీరంలో మంగళవారం స్వచ్ఛత రన్ నిర్వహించారు. ఈ నెల 15 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు గాంధీ జయంతిని పురస్కరించుకుని చేపట్టిన స్వచ్ఛత హీ సేవలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం జరిపారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ రన్‌లో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని కోరారు.

పాము కాటు బాధితుడికి పరామర్శ



పాము కాటుకు గురైన రామును పరామర్శిస్తున్న వెంకటరావు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరి ఎండాడకు చెందిన మైలపల్లి రాము మంగళవారం పాముకాటుకు గురయ్యారు. స్థానికులు హుటాహుటిన ఆయన్ను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు కేజీహెచ్‌కు వెళ్లి బాధితుడ్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు కొంత ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మిడి కల్యాణ్, పోలవరపు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



సాగరతీరంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రామారావు, ఎస్ఐ రాము

బీచ్ రోడ్డు: సాగరతీరంలో మూడో పట్టణ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ రాము, సిబ్బంది ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. వాహన పత్రాలను తనిఖీ చేశారు. నగరంలో పలు చోట్ల దొంగతనం కేసులు నమోదు కావడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

ఇంటింటికీ ఆరోగ్య రక్ష

- చురుగ్గా ఇంటింటి సర్వే
- ప్రజల ఆరోగ్య సమస్యలు యాప్‌లో నమోదు
- శిబిరంలో వైద్యసేవలు అందించేలా చర్యలు



11వ వార్డులో యువతికి రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి



16వ వార్డు పాత వెంకోజీపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంపై దృష్టి సారిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది ప్రజారోగ్య రక్షణకు చర్యలు చేపడుతున్నారు. 'నాడు–నేడు'లో భాగంగా ప్రభుత్వాస్పత్రులు ఆధునికీకరించి, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజల ఇంటికే వెళ్లి వైద్యులు సేవలు అందించి ప్రశంసలు పొందుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య



నరసింహనగర్‌లో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఏఎన్ఎం, సిబ్బంది

పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. షుగర్, క్యాన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. స్థానిక వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వేను చురుగ్గా చేపడుతున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు అక్కడికక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సురక్ష సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి కోరారు. జీవీఎంసీ 11, 13 వార్డుల యూపీహెచ్‌సీల పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆమె సందర్శించారు. యూపీహెచ్‌సీల వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్లారు. సిబ్బంది చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఆమె నేరుగా స్థానికులతో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయడం ప్రజలకు మంచి అవకాశమన్నారు. కొద్ది రోజులు పాటు సర్వేలు చేపట్టిన అనంతరం వార్డులు, యూపీహెచ్‌సీల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీకృష్ణాపురం, ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, సుందర్‌నగర్ యూపీహెచ్‌సీల పరిధిలో అక్టోబరు 7వ తేదీ నుంచి వైద్య శిబిరాలు నిర్వహించనున్నామన్నారు.



28వ వార్డు రామ్‌నగర్‌లో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బంది

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లో సచివాలయం ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సురక్ష సర్వే చేశారు. ప్రజలకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారి పేర్లు యాప్‌లో నమోదు చేశారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు ఇసుకతోట యూపీహెచ్‌సీ పరిధిలోని పాత వెంకోజీపాలెం, కేఆర్ఎం కాలనీ, భానునగర్, రజకవీధి, ఇసుకతోట, అంబేడ్కర్ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేపట్టారు. పాత వెంకోజీపాలెంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో 150 మందికి ఏడు రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఇసుకతోట యూపీహెచ్‌సీ హెచ్‌వీ సాయి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, నర్సింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల గణపతికి మేయర్ ప్రత్యేక పూజలు



పూజలు సందర్భంగా మేయర్‌కు తిలకందిద్దుతున్న ధనలక్ష్మి

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బాలగణపతిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఎంవీపీ కాలనీ సెక్టార్–9లోని బాల గణపతి మండపానికి విచ్చేసి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డులోని సమస్యలపై మేయర్ ఆరా తీశారు. వార్డులోని సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ పరంగా అవసరమైన సహకారం అందిస్తామన్నారు. పరిపాలన రాజధానిగా విశాఖకు మంచి గుర్తింపు వస్తుందన్న ఆమె త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పరిపాలన అంతా విశాఖ నుంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పుక్కళ్ల శంకర్, వాసుపల్లి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



మద్దిలపాలెంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని

బీచ్ రోడ్డు: గణపతి నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం జీవీఎంసీ 22వ వార్డులోని పోలమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీపాలెంలో సిద్దార్థనగర్‌లో అన్నదానం చేశారు. సిద్ధార్థనగర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించి, భక్తులకు వడ్డించారు. ఈ అన్నసంతర్పణకు



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పీతల గోవింద్

వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ 9 బియ్యం బస్తాలు అందజేశారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో ఫ్రెండ్స్ ఫర్ ఏవర్ బాయ్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ బోస ఎర్రయ్యరెడ్డి, పార్టీ నాయకుడు అచ్చి రమేష్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 10వ ద్వి–వార్షిక సర్వసభ్య సమావేశాలు మంగళవారం తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐఆర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెయింటెనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వీరిని సూపర్‌వైజర్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఐఆర్ గుర్తింపు పొందిన యూనియన్ల పోరాటంతో త్వరలోనే ఎన్‌పీఎస్ రద్దవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కే కే, కే–ఆర్ లైన్‌లో ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు వర్క్ టు రూల్ అమలు చేయాలని, సిబ్బందికి పనిభారం తగ్గేలా చూడాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్‌ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్, డివిజనల్ కో–ఆర్డినేటర్ టి.వి.మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు ముద్ర రుణాల మంజూరుకు వినతి



ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ వెంకటరమణారావుతో కర్రి వేణుమాధవ్

బీచ్ రోడ్డు: విశాఖ జోన్ పరిధిలోని స్వర్ణకారులకు ముద్ర రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు ఇండియన్ బ్యాంక్ విశాఖపట్నం జోనల్ మేనేజర్ సిహెచ్.వెంకటరమణారావును మంగళవారం జోనల్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కనీసం 300 మంది స్వర్ణకారులకు రుణాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే స్వర్ణకారులకు విశాఖ జోన్‌లో రూ.20 కోట్లు రుణాలు ఇచ్చారని, వారిలో 95 శాతం మంది తిరిగి చెల్లింపులు పూర్తి చేశారన్నారు. మిగతా 5 శాతం కూడా ఈ రెండు నెలల్లో చెల్లింపు పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. ముద్ర రుణాల ద్వారా స్వర్ణకారుల పెట్టుబడి 20 శాతం వృద్ధి చెందిందన్నారు. దీనిపై జోనల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, విశాఖ అధ్యక్షుడు ముదపాక రవి, ప్రధాన కార్యదర్శి పెద్దపూడి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

8 మంది మందుబాబులకు జైలు శిక్ష

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యూపోర్టు, హార్బర్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందిని ఒకటో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్‌కు 10 రోజులు జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి మొత్తంగా రూ.1.78 లక్షలు జరిమానా వేశారు. ఆరిలోవ పరిధిలో 16 మందికి రూ.30,500, పీఎం పాలెం పరిధిలో 14 మందికి రూ.49 వేలు, గోపాలపట్నం స్టేషన్ పరిధిలో 10 మందికి రూ.26 వేలు, పెందుర్తిలో 20 మందికి రూ.47,500 జరిమానా విధించారు. అలాగే కంచరపాలెం స్టేషన్ పరిధిలో 20 మందికి రూ.1.04 లక్షల జరిమానా విధించడంతో పాటు వారిలో ఏడుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. గాజువాక పరిధిలో 15 మందికి రూ.38 వేలు, టూ టౌన్ స్టేషన్ పరిధిలో 15 మందికి రూ.1.19 లక్షలు జరిమానా వేశారు.

ఏయూ సమాచారం..

రంగస్థల విభాగ విద్యార్థినికి అభినందన



సాయిప్రియను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం విద్యార్థిని ఎం.సాయిప్రియను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. నాటకం, నృత్యం, వ్యాఖ్యానం, ఆహార్యం తదితర రంగాలలో సాయిప్రియ చూపుతున్న ప్రతిభకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ సందర్భంగా వీసీ తన కార్యాలయంలో ఆమెను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం.భాస్కరరావు, డాక్టర్ ఎం.శశిభూషణరావు, రఘురాం, సత్యనారాయణ, శ్రీనివాసరావు, దుర్గారావు, అర్జతుల్లా, సూర్యకళ, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వర్సిటీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏయూ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఏయూ ఉద్యోగులకు రక్త పరీక్షలు, ఈసీజీ, ఏకో, బీపీ పరీక్షలు చేశారు. రిపోర్టుల ఆధారంగా ఉద్యోగులకు అవసరమైన చికిత్స విధానాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ సమన్వయం చేశారు.

నాయకత్వం, నైపుణ్యాలపై అవగాహన



అజిత్‌కుమార్‌ని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి, తదితరులు

ఏయూ క్యాంపస్: నాయకత్వ లక్షణాలు వ్యక్తి ప్రగతిని, వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వీడీఎం ఇండియా ఆన్ దమూవ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నాయకత్వ నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. సమూహంగా పని చేయడం, సమష్టిగా విజయం సాధించడం, నాయకత్వం వహించడం వంటి విభిన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, వ్యవస్థను ప్రభావితం చేసే వ్యక్తులుగా ఎదగాలన్నారు. నాయకత్వంలో విధానాలు, పెంపొందించే అంశాలు, ప్రాధాన్యతలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి, విభాగాధిపతి ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కార గ్రహీతకు సత్కారం



సరస్వతి విద్యార్థిని సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: డాక్టర్ ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కారం అందుకున్న ఏయూ సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి విద్యార్థిని మంగళవారం ఉదయం విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీ షణ్ముఖానంద సభ నుంచి ఆమె ఈ పురస్కారం స్వీకరించిన సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆచార్య సరస్వతి విద్యార్థి కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ భారతీయ సంగీతం, సాహిత్యం ఎంతో విశిష్టమైనవన్నారు. ఏయూ సంగీత విభాగం దశాబ్దాలుగా ఎందరో గాయకులను తీర్చిదిద్ది సమాజానికి అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య అనూరాధ, విభాగ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలు అవసరం



రవీంద్ర శుక్లాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మానవతా విలువలు యువత కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పూర్వ విద్యాశాఖ మంత్రి డాక్టర రవీంద్ర శుక్లా అన్నారు. మంగళవారం ఆయన ఏయూ హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలను విద్యా వ్యవస్థలో అంతర్భాగం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా తాను పనిచేసిన సమయంలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని నిలుపుతూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర శుక్లాను హిందీ విభాగ ఆచార్యులు నల్ల సత్యనారాయణ, ఆచార్యులు, పరిశోధకులు, తదితరులు ఘనంగా సత్కరించారు.

ఎన్ఎల్ఎం పథకంతో బహుళ ప్రయోజనాలు

- రైతులకు సబ్సిడీపై రుణాల మంజూరు
- స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం



సదస్సులో పాల్గొన్న రైతులు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ: ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం తెలిపారు. జిల్లా పశు సంవర్థక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 368 మంది రైతులు పాల్గొన్న ఈ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎల్ఎం కింద గొర్రెలు–మేకలు, నాటు కోళ్లు, పందుల పెంపకందార్లతో పాటు పాడి రైతులు పశుదాణా ఉత్పత్తి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు వ్యాపార సరళిలో ఎన్ఎల్ఎం పథకం ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు ఏర్పాటు కోసం ముందుకొచ్చిన రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కూడా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకం లక్ష్యాల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పలువురు అధికారులు బ్యాచ్‌ల వారీగా అవగాహన కల్పించారు. ఎన్ఎల్ఎం పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ఎంత సబ్సిడీ లభిస్తుంది తదితర వాటి గురించి వివరించారు. ఉప సంచాలకుడు డాక్టర్ కె.కరుణాకరరావు, డీసీబీసీయూ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డాక్టర్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.శ్రీనుబాబు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



బీచ్ రోడ్డు: తీరానికి గుర్తు తెలియని 25 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం కొట్టుకువచ్చింది. ఆర్కే బీచ్ ప్రాంతంలో రాళ్ల వద్ద మృతదేహం కనిపించడంతో సందర్శకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మూడో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ రామారావు తెలిపారు.

నేడు ఎడిటింగ్ ల్యాబ్‌ల ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం, సెయింట్ లూక్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆడియో ల్యాబ్, వీడియో ఎడిటింగ్ స్టూడియో, కంప్యూటర్ ల్యాబ్‌లను బుధవారం ప్రారంభించనున్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వీటిని ప్రారంభిస్తారు. ప్రముఖ బాలీవుడ్ సౌండ్ ఇంజినీర్, సంగీత దర్శకుడు సన్నీ ఎం.ఆర్ విశిష్ట అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 11 గంటలకు ఏయూ సంగీత విభాగం మొదటి అంతస్తులో ఉన్న మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగంలో ఈ కార్యక్రమం జరగనుంది.